సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

స్కేటింగ్‌లో బాలుడి ప్రతిభ


పతకాలు సాధించిన ఒమ్మి తరుణ్

కొమ్మాది : విశాఖ జిల్లా రోలర్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలో జరిగిన రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో జీవీఎంసీ 8వ వార్డు గొల్లల ఎండాడ ప్రాంతానికి చెందిన ఒమ్మి తరుణ్ రెండు బంగారు పతకాలు దక్కించుకున్నాడు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో తరుణ్ ప్రతిభ కనబరిచి... త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల నగరంలో, కాకినాడలో జరిగిన పోటీల్లో కూడా బంగారు, రజత పతకాలు దక్కించుకున్నాడు.

ముగిసిన శిక్షణ తరగతులు


శిక్షణలో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్లు

కొమ్మాది: రుషికొండలో గల గాయత్రీ కళాశాలలో ఉత్తరాంధ్ర జిల్లాల ఎన్‌సీసీ క్యాడెట్ల శిక్షణ సోమవారం ముగిసింది. పది రోజుల నుంచి నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో మ్యాప్ రీడింగ్, ఫైరింగ్, మిలటరీ హిస్టరీ, ఎన్‌సీసీ ప్రాముఖ్యతను వివరించడంతోపాటు రోజూ ఉదయం పీటీ డ్రిల్, మోటివేషన్ తరగతులు నిర్వహించినట్లు ఎన్‌సీసీ అధికారి ఆర్.బి.ఆనందరావు తెలిపారు.

ఎన్‌ఎస్‌ఐటీలో అతిథి ఉపన్యాసం


ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ విశ్వనాథరాజు

తగరపువలస: ఆనందపురం మండలం శొంఠ్యాం ఎన్‌ఎస్‌ఆర్ ఐటీలో సోమవారం జేఎన్‌టీయూ(హైదరాబాద్) కంప్యూటర్ సైన్స్ సీనియర్ ప్రొఫెసర్ ఎస్.విశ్వనాథరాజు అతిథి ఉపన్యాసం ఇచ్చారు. అవుట్‌కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్, అవుట్‌కమ్ బేస్డ్ అక్రిడియేషన్ గురించి వివరించారు. ఎన్‌బీఏ అక్రిడియేషన్ ప్రాసెస్‌లో అసెస్‌మెంట్, ఈవాల్యుయేషన్ ప్రక్రియలతో పాటు కోర్సు ఫలితాలు, ప్రొగ్రాం ఫలితాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ శంభుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వుడెన్ ఫ్లోర్ వేయాలని వినతి

భీమునిపట్నం: భీమిలిలో ఇండోర్ స్టేడియంలో వుడెన్ ఫ్లోర్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఇండోర్ స్టేడియం కమిటీ సభ్యులు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కా వేదిక (పీజీఆర్ఎస్)లో జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్న వాణికి వినతి పత్రం ఇచ్చారు. రూ. మూడు కోట్లతో నిర్మించిన ఈ స్టేడియంలో సిమెంట్ ఫ్లోర్ నిర్మించడంతో షటిల్, వాలీబాల్, ఇతర క్రీడలు ఆడేవారికి ఇబ్బందిగా ఉందని వివరించారు. వెంటనే వుడెన్ ఫ్లోర్‌గా మార్చాలని కోరారు. ఇందులో కమిటీ సభ్యులు నక్కా రవికుమార్, కొళ్ల సన్నీ, ఫల్గుణ, రాజేష్ పాల్గొన్నారు.

సిరిటెక్ ప్రారంభం

మధురవాడ: ఐటీ సెక్టార్‌లో మరిన్ని ఉద్యోగ అవకాశాలు రాబోతున్నాయని విశాఖ ఎంపీ శ్రీభరత్ చెప్పారు. జీవీఎంసీ 5వ వార్డు మారికవలసలో ఏర్పాటు చేసిన సిరి సాఫ్ట్‌వేర్ కంపెనీని సోమవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. సాయంత్రం సంస్థను ఎంపీ శ్రీభరత్, పాలకొండ, గాజువాక ఎమ్మెల్యేలు నిమ్మక జయకృష్ణ, పల్లా శ్రీనివాసరావులతో కలసి సందర్శించారు. ఉపాధి అవకాశాలు పెరిగేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సిరి టెక్ సీఈవో హరి తోట, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి, జనసేన భీమిలి ఇన్‌చార్జి పంచకర్ల సందీప్ పాల్గొన్నారు.


బాధ్యతల స్వీకరణ

పద్మనాభం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్‌గా జయ ఉమ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె డుంబ్రిగుడ మండల పరిషత్ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. పలువురు పంచాయతీ సెక్రటరీలు, కార్యాలయ సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు.

- జాతీయ రహదారిలో వెలగని విద్యుత్ లైట్లు
- చీకట్లో ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

కూడళ్లలో అంధకారం


జీడిపప్పు దుకాణాల సమీపంలో ఫ్లై ఓవర్ వద్ద వెలగని లైట్లు


సబ్బవానిపేట వద్ద వెలగని లైట్లు


విజయనగరం నుంచి తగరపులస వైపు వచ్చే మార్గంలో వెలగని లైట్లు


సంగివలస అండర్‌పాస్ వద్ద అంధకారం


వేంకటేశ్వర మెట్ట వద్ద విజయనగరం వెళ్లే మార్గంలో అంధకారం


పోలీస్ అవుట్‌పోస్టు ఎదురుగా వెలగని లైటు

తగరపువలస : జాతీయ రహదారిపై ముఖ్యమైన కూడళ్ల వద్ద అంధకారంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రమాదాల నివారణకు లైట్లు పునరుద్ధరించాలని వాహనదారులు కోరుతున్నారు. జాతీయ రహదారుల విస్తరణ సమయంలో డివైడర్‌తోపాటు ఇరువైపులా రహదారులకు, సర్వీస్‌రోడ్లకు కలిపి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణపై దృష్టి సారించకపోవడంతో ఇష్టం వచ్చినప్పుడు వెలిగి ఆరిపోతున్నాయి. ముఖ్యంగా జీవీఎంసీ పరిధిలో కూడళ్ల వద్ద అంధకారం రాజ్యమేలుతోంది. వీటిలో ముఖ్యమైనది వెంకటేశ్వరమెట్ట. జీవీఎంసీ పరిధి ముగిసే ఈ ప్రాంతంలో విద్యుత్ దీపాలు కొంతకాలంగా వెలగకపోవడంతో ఇక్కడి పోలీస్ అవుట్ పోస్ట్ వద్ద ఫోకస్ లైట్లు ఏర్పాటు చేశారు. ఈ లైట్లు దేదీప్యమానంగా వెలుగుతున్నప్పటికీ విజయనగరం వైపు వెళ్లే రోడ్డు వరకు కాంతి ప్రసరించడం లేదు. దీంతో పోలీస్ అవుట్‌పోస్ట్‌కు, గోస్తనీనది వంతెనకు మధ్య భాగం ఇరువైపులా చీకటిగా ఉంటుంది. అంతేకాకుండా సంగివలస, తాళ్లవలస, వలందపేట, సబ్బవానిపేట తదితర గ్రామాల కూడళ్ల వద్ద కూడా తరచూ లైట్లు మసకబారుతున్నాయి. ముఖ్యంగా పొగ మంచు, వర్షం కురిసే సమయంలో వాహనాల వెలుతురు పెద్దగా కనిపించకపోవడంతో ఎక్కువగా సెల్ఫ్ యాక్సిడెంట్లు జరుగుతున్నాయి. చివరి నిమిషంలో వాహనాల డ్రైవర్లు గుర్తిస్తున్నప్పటికీ ప్రమాదాల నుంచి తప్పించుకోలేకపోతున్నారు. రాత్రి వేళ డాబాలు, హోటళ్ల వద్ద ఆహారం కోసం నిలిపి ఉంచే వాహనాలు, రోడ్ల పక్కన వాహనాలు నిలిపి సిబ్బంది నిద్రపోయేటప్పుడు ప్రమాదాలకు ఆయా ప్రాంతాల్లో అంధకారమే కారణమని తెలుస్తోంది.

చీకటి ప్రాంతాలే ఆకతాయిలకు అడ్డా

గతంలో సంగివలస దివీస్ పార్కు వద్ద రాత్రి 10 గంటలు దాటిన తర్వాత ద్విచక్ర వాహనాలపై ఒంటరిగా రాకపోకలు సాగించేవారిపై ఆకతాయిలు దాడులకు పాల్పడేవారు. ప్రస్తుతం దీనికి దగ్గరగా సంగివలస అండర్‌పాస్‌లో లైట్లు వెలగక చీకటిగా ఉండడంతో ఆ మార్గంలో ప్రయాణించడానికి ఎవరూ సాహసించడం లేదు. భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీ పరిధిలో కూడా తరచూ చీకటిగానే ఉంటుంది. తిరుమల విద్యా సంస్థల నుంచి ఫైర్ స్టేషన్ వరకు చీకటి కారణంగానే ఎక్కువగా ఈ ప్రాంతంలో కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. వలందపేట వద్ద జాతీయ రహదారితోపాటు సర్వీస్ రోడ్డులో వీధిదీపాలు వెలగకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ చీకటి ప్రాంతాల్లో విద్యుత్ వెలుగులు నిరంతరం ప్రసరించేలా జాతీయ రహదారుల సంస్థ పర్యవేక్షించాలని వాహనదారులు కోరుతున్నారు.

కూడళ్ల వద్ద లైటింగ్ తప్పనిసరి



కూడళ్ల వద్ద ప్రయాణికులు వాహనాల కోసం వేచి ఉంటారు. అదే సమయంలో చీకటిలో వచ్చే వాహనాల సిబ్బంది అయోమయానికి గురై ప్రమాదాలకు కారణమవుతున్నారు. అందువల్ల కూడళ్ల వద్ద లైటింగ్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి.

– వెంపాడ చిట్టిబాబు, తాపీమేస్త్రి

అండర్‌పాస్‌లో పునరుద్ధరించాలి



రోడ్లు మారి స్వగ్రామాల్లోకి వెళ్లేందుకు ఎక్కువ మంది అండర్‌పాస్‌లను వినియోగిస్తుంటారు. అలాంటిది తగరపువలస శివారు సంగివలస అండర్‌పాస్‌లో లైటింగ్ లేకపోవడం ఆందోళనకు గురి చేస్తోంది. వెంటనే ఇక్కడి లైట్లు పునరుద్ధరించాలి.

– చేట్ల గురుమూర్తి రెడ్డి, మాజీ సైనికుడు

లైట్లన్నీ వెలిగించాలి



వేంకటేశ్వర మెట్ట కూడలి వద్ద నిత్యం వేలాది మంది వాహనాల కోసం వేచి ఉంటారు. ఇక్కడ అవుట్‌పోస్ట్ వద్ద ఫోకస్ లైటింగ్ సరిపోవడం లేదు. స్తంభాలకు లైట్లు పునరుద్ధరించాలి. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి అవసరమైన చర్యలు చేపట్టాలి.

– కుంచం రమణ, ఫొటోగ్రాఫర్

గంగ ఒడికి దుర్గమ్మ


చిట్టివలస రైతుబజారు నుంచి అమ్మవారి విగ్రహం తరలింపు


చిట్టివలస వాణీ స్కూల్ ఏరియా మండపం నుంచి..


కార్మికవాడ మండపాల నుంచి...

తగరపువలస: దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. దుర్గమ్మకు విశేష పూజలు నిర్వహించిన ఉత్సవ కమిటీలు సోమవారం సాయంత్రం మండపాల నుంచి అమ్మవార్లను గోస్తనీనది, భీమిలి సముద్రతీరంలో నిమజ్జనానికి తరలించారు. కోలాటం, బాణసంచా, తీన్‌మార్, కోలాటం, నేలవేషాలు, కాళికానృత్యాలు, పులివేషాలతో అమ్మవార్ల విగ్రహాలను ఊరేగించారు. చిట్టివలస రైతు బజారు, చిట్టివలస వాణీ విద్యానికేతన్, సంతపేట రెడ్డివీధి, కొండపేట గ్రామాల నుంచి విగ్రహాల ఊరేగింపు గొల్లవీధి, మెయిన్‌రోడ్డు, చిట్టివలస, కార్మికవాడ మీదుగా సాగింది.

పొంచి ఉన్న ప్రమాదం!


రోడ్డుపై పేరుకుపోయిన ఇసుక

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీ బర్లపేటలో రోడ్డుపై ఇసుక పేరుకుపోయింది. దీంతో ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న ఇసుకను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చంద్రంపాలెంలో భారీ అన్నసమారాధన


దుర్గాలమ్మ ఆలయం ఆవరణలో అన్న సమారాధన ప్రారంభిస్తున్న నిర్వాహకులు

మధురవాడ : శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా జాతర గట్టు చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. జీవీఎంసీ 6వ వార్డు భాస్కర్‌నగర్‌కి చెందిన బండి దుర్గాకిషోర్ కుమార్, కృష్ణకుమారి దంపతులు, చంద్రంపాలెం దుర్గానగర్‌కి చెందిన జీకే బిల్డర్స్ గోకరకొండ శ్రీకాంత్, లక్ష్మి చైతన్య దంపతులు, కెనడాకి చెందిన ఎన్‌ఆర్‌ఐ కె.రవికుమార్, స్వాతి దంపతుల సహకారంతో అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. భక్తులకు ఆలయ ధర్మకర్త పిల్లా చంద్రశేఖర్, అధ్యక్షుడు పిల్లా సూరిబాబు, ఉపాధ్యక్షుడు యస్ఎన్ మూర్తి, పీవీజీ అప్పారావు, కార్యదర్శి నాగోతి తాతారావు, కార్యవర్గ సభ్యులు పిల్లా శ్రీనివాసరావు, దుక్క వరం అన్నప్రసాదం వడ్డించారు. గ్రామ పెద్దలు పిల్లా శ్రీనివాసరావు, పిల్లా సత్యనారాయణ, జగ్గుపిల్లి నాని, బోగవిల్లి నాని, జగ్గుపిల్లి నరేష్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ముగింపు ఉత్సవాల్లో అమ్మవారికి విశేష అలంకరణ చేసి పల్లకీ సేవ నిర్వహించారు. ఎండాడకి చెందిన రేవతి డెవలపర్స్ అధినేత ఎల్‌డీవీ ప్రసాదరావు కుటుంబ సభ్యుల సహకారంతో లడ్డూ ప్రసాదం అమ్మవారికి నివేదించి భక్తులకు పంపిణీ చేశారు.

తగరపువలస : జీవీఎంసీ రెండో వార్డు గ్రంథాలయ వీధిలో దసరా ఉత్సవాల్లో భాగంగా సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. వేలాది మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

ఐఎంఎఫ్‌ఎల్ డిపోల్లో జట్ల పనులు కొనసాగించాలి


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

మహారాణిపేట: ఐఎంఎఫ్‌ఎల్ డిపో 1, డిపో 3ల్లో రెండు జట్ల పనులను యథావిధిగా కొనసాగించాలని హమాలీలు, కార్మికులు కోరారు. ఈమేరకు సోమవారం కలెక్టర్‌కు పలు సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. విశాఖ జిల్లా ముఠా కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ డిపోల్లో 30 ఏళ్లుగా లోడింగ్, అన్‌లోడింగ్ పనులు చేసుకుంటూ 110 కుటుంబాలు జీవిస్తున్నాయని కార్యదర్శి ఎం.సుబ్బారావు తెలిపారు. డిపోల ప్రారంభం నుంచి అధికారుల పట్ల వినయ విధేయతలతో సేవలందిస్తున్నారని, ఎన్ని ఇబ్బందులు వచ్చినా పనులకు ఆటంకం కలగకుండా చూస్తున్నామన్నారు. ప్రభుత్వ విధానాల వల్ల అనేక నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని, తమ జీతాలు పెరగలేదని, తక్షణం జీతాలు పెంచాలని, కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

కేజీహెచ్ సెక్యూరిటీ గార్డుల ఆందోళన


కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సెక్యూరిటీ గార్డులు

మహారాణిపేట: బకాయి జీతాలు ఇవ్వాలని కోరుతూ కేజీహెచ్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులు సోమవారం ఆందోళనకు దిగారు. 3 నెలలుగా జీతాలు ఇవ్వలేదని, దసరా సందర్భంగా ఇస్తారని భావించినా చెల్లించకపోవడంతో వీరంతా ప్రదర్శన నిర్వహించారు. కేజీహెచ్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన సాగింది. కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టి, జీతాలు ఇవ్వాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం వరకు ప్రదర్శన చేశారు. సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందించారు. సీఐటీయూ జగదాంబ జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు, సీఐటీయూ నాయకుడు కె.చంద్రశేఖర్ కేజీహెచ్‌లో పనిచేస్తున్న సాయి సెక్యూరిటీ గార్డులు సుమారు 30 మందితో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రదర్శన అనంతరం విధులకు హాజరయ్యారు. న్యాయపరమైన డిమాండ్లను తక్షణం ఆమోదించాలని, బకాయి జీతాలు ఇవ్వాలని కార్మికులు నినాదాలు చేశారు. తమకు న్యాయబద్ధమైన జీతం రూ.11,257 ఇవ్వాలని, కాంట్రాక్టర్ రూ.9,090 మాత్రమే ఇస్తున్నారని, కటింగ్‌ల పేరిట మిగిలిన సొమ్ము ఇవ్వడం లేదని సెక్యూరిటీ గార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇళ్ల మధ్యలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దు


వినతిపత్రం అందజేస్తున్న వికలాంగుల కాలనీవాసులు

మధురవాడ: జీవీఎంసీ 8వ వార్డులోని వికలాంగుల కాలనీలో నివాసాల చెంత మద్యం షాపు ఏర్పాటుకు అనుమతి ఇవ్వవద్దని శ్రీ వెంకటేశ్వర రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ వాసులు కోరారు. మధురవాడ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో అసిస్టెంట్ కమిషనర్ శివకుమార్‌కు కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు కేఎస్ ప్రసాద్, రమణ తదితరులు వినతి పత్రం అందజేశారు. పోలీస్ శాఖలో పని చేస్తున్న ఓ వ్యక్తి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి చికెన్ దుకాణానికి అద్దెకు ఇచ్చాడని.. అతనే మద్యం దుకాణం ఏర్పాటుకు అద్దెకు ఇస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. అలాగే జోన్‌లోని వివిధ ప్రాంతాల్లోని పలు సమస్యలపై ఏడు అర్జీలు వచ్చాయి.

కలాసీలకు సర్వీస్ బెనిఫిట్స్ చెల్లించాలి


ధర్నా చేస్తున్న ముఠా కార్మికులు

సీతంపేట : స్పెన్సర్స్ యాజమాన్యం కలాసీలకు సర్వీస్ బెనిఫిట్స్ చెల్లించాలని ముఠా కార్మిక సంఘం (ఏఐటీయూసీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు రేసపువానిపాలెం స్పెన్సర్స్ హైపర్ మాల్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.మన్మధరావు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే రెహమాన్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా 22 మంది కలాసీలు ఇక్కడ లోడింగ్, అన్‌లోడింగ్ పనులు చేస్తున్నారన్నారు. స్పెన్సర్స్ మాల్ మూసివేతతో వారంతా దిక్కుతోచని స్థితిలో పడ్డారన్నారు. రోడ్డున పడ్డ వీరికి సర్వీస్ బెనిఫిట్స్ ఇవ్వాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. యాజమాన్యం కలకత్తాలో ఉంటూ లేబర్ ఆఫీసులో జరిగే జాయింట్ మీటింగ్‌లకు హాజరుకాకుండా, కలాసీల సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు.

ఫుట్‌పాత్‌లపై తుప్పలతో అవస్థలు




శొంఠ్యాం నుంచి వేములవలస వరకు ఫుట్‌పాత్‌పై ప్రమాదకరంగా తుప్పలు

తగరపువలస : ఆనందపురం మండలం శొంఠ్యాం నుంచి వేములవలస వరకు జాతీయ రహదారి వెంట ఫుట్‌పాత్‌లపై తుప్పలు మొలిచాయి. స్థానికంగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కాలినడకన దగ్గర గ్రామాలకు వెళ్లాలన్నా ఫుట్‌పాత్‌లు అనువుగా లేవు. చాలా వరకు ఫుట్‌పాత్‌లన్నీ గుబురుగా ఉండే మొక్కలతో కనిపించకుండా పోయాయి. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో స్థానికులు సర్వీస్ రోడ్డుపై నడుస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. జాతీయ రహదారుల సంస్థ నిర్వహణ పనుల్లో భాగంగా ఫుట్‌పాత్‌లపై మొలిచిన తుప్పలను తొలగించి నడిచి వెళ్లేవారికి అనువుగా ఉంచాలని పలువురు కోరుతున్నారు.

17 నుంచి ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు శిక్షణ

పద్మనాభం:మండలంలోని 22 పంచాయతీల ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు పంచాయతీ పరిపాలనపై ఈ నెల 17, 18వ తేదీల్లో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు ఈవోఆర్డీ మీనా కుమారి తెలిపారు. ప్రతి పంచాయతీ నుంచి ఉప సర్పంచ్, ఇద్దరు వార్డు మెంబర్లకు ఈ శిక్షణ ఉంటుందని ఆమె పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు తరగతులు ఉంటాయని ఆమె తెలిపారు.

ప్రజా రవాణాతో కాలుష్య నియంత్రణ


ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి వస్తున్న మేయర్ హరివెంకటకుమారి

దాబాగార్డెన్స్: వారంలో ఒకరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. ఆమె తన క్యాంప్ కార్యాలయం నుంచి సోమవారం జీవీఎంసీ కార్యాలయానికి ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అదనపు కమిషనర్ వై.శ్రీనివాసరావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా వారంలో ఒక రోజు జీవీఎంసీ ఉద్యోగులతోపాటు అందరం ప్రజా రవాణాను వినియోగిస్తున్నామన్నారు. నగరంలో పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక అవగాహన పర చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలలు, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు వారంలో ఒకరోజు ప్రజా రవాణా వ్యవస్థ వినియోగించడం వల్ల విశాఖలో కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రించేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

తగరపువలస: భీమిలి మండలం గొల్లల తాళ్లవలసలో రూ.30 లక్షలు ఎంఎన్‌ఆర్‌ఐజీఎస్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు భూమిపూజ చేశారు. పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా చేపడుతున్న పనులను పూర్తి చేయాలని సూచించారు. ఎంపీడీవో హనుమంతరావు, ఎంపీటీసీ సభ్యుడు కోరాడ రమణ, జెడ్పీటీసీ వెంకటప్పడు, పంచాయతీ విస్తరణ అధికారి రమేష్‌నాయుడు, ఏపీడీ ఆంజనేయులు పాల్గొన్నారు.